# సిద్దిపేటలో సరికొత్త షాపింగ్ అనుభూతి

## విశాల షాపింగ్ మాల్ ప్రారంభం

- సిద్దిపేట పట్టణం వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది: కడవేరుగు రాజనర్సు
- ఇక్కడ ప్రజల అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది: సినీ నటి నిధి అగర్వాల్







**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని కంచరి బజార్‌లో సరికొత్త షాపింగ్ శకం మొదలైంది. సోమవారం విశాల షాపింగ్ మాల్‌ను అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ వేడుకకు 'రాజా సాబ్' సినిమాతో గుర్తింపు పొందిన సినీ నటి నిధి అగర్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### అభివృద్ధికి చిహ్నం

ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ.. సిద్దిపేట పట్టణం దినదినాభివృద్ధి చెందుతోందని, ప్రజలకు చేరువలో ఇటువంటి ఆధునిక వస్త్ర విక్రయ కేంద్రాలు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. పట్టణవాసులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్న వ్యాపారవేత్తలను ఆయన అభినందించారు. సినీ నటి నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. షాపింగ్ మాల్ లోని వస్త్ర శ్రేణి చాలా బాగుందని, మహిళలకు నచ్చే అత్యాధునిక డిజైన్లు అందుబాటులో ఉన్నాయని కొనియాడారు.

### అట్టహాసంగా ప్రారంభోత్సవం


మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, పలువురు వ్యాపారవేత్తలు, స్థానిక నాయకులు ఈ వేడుకలో సందడి చేశారు. తమ అభిమాన నటిని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సిద్దిపేట ప్రజలకు మేలైన నాణ్యతతో కూడిన దుస్తులను, ఆధునిక షాపింగ్ సౌకర్యాలను ఒకే చోట అందించాలనే లక్ష్యంతో ఈ మాల్‌ను ఏర్పాటు చేసినట్లు యాజమాన్యం వివరించింది. వచ్చిన అతిథులను మాల్ ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.



# జన్నారం గోస విన్నారా

- ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం
- అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రజావాణిలో ఎండగట్టిన తుడుం జితేందర్
- తక్షణమే సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం








**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. 29 గ్రామాలకు గుండెకాయ వంటి ఈ మండల కేంద్రంలో కనీసం ఒక్క ప్రజా మరుగుదొడ్డి లేకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, భూమి లేదనే కుంటి సాకులతో కాలయాపన చేస్తున్న అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.

### సంత రోజున మహిళల నరకయాతన

ప్రతి మంగళవారం జన్నారంలో జరిగే వారపు సంత ఒక అస్తవ్యస్త దృశ్యాన్ని తలపిస్తోంది. తెల్లవారుజామునే గూడెల నుంచి, తండాల నుంచి తమ కష్టాన్ని నమ్ముకుని కూరగాయలు అమ్మడానికి వచ్చే మహిళా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వరకు మలమూత్ర విసర్జన ఆపుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. బస్టాండ్ ఆవరణ ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటుంది తప్ప, అత్యవసరానికి ఒక్క టాయిలెట్ లేదు. కవ్వాల్, ధర్మారం చౌరస్తాల వంటి కీలక ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది.

### ప్రజావాణిలో అధికారుల అసమర్థత బట్టబయలు

ఇటీవల జిల్లా స్థాయి ప్రజావాణిలో తుడుం జితేందర్ ఈ సమస్యను కలెక్టర్ కుమార్ దీపక్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ప్రభుత్వ భూమి లేదని అధికారులు కలెక్టర్ కు చెప్పగా, జితేందర్ వారిని గట్టిగా నిలదీశారు. బస్టాండ్ దగ్గర ఉన్న ఇరిగేషన్ భూమి, కవ్వాల్ పాయింట్ వద్ద ఉన్న స్థలాల గురించి ప్రస్తావించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు, ప్రజలకు ఉపయోగపడే మరుగుదొడ్ల నిర్మాణానికి మాత్రం స్థలం లేదనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కలెక్టర్ ఆదేశాలు.. పరిష్కారం లభించేనా?

జితేందర్ ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య సీరియస్ అయ్యారు. వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల తర్వాతైనా ఫైళ్లు కదులుతాయా లేక ఎప్పటిలాగే సాకుల వెనుక అధికారులు దాక్కుంటారా అనేది వేచి చూడాలి.

### ప్రధాన డిమాండ్లు:

బస్టాండ్, కవ్వాల్ చౌరస్తా వద్ద తక్షణమే మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి.

ఇరిగేషన్ భూమిని కేటాయించి శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాలకు వాడాలి

# మాజీ మంత్రి హరీశ్ రావు కృషితో పాలమాకులకు సరికొత్త శోభ

### బటర్‌ఫ్లై లైట్లు ప్రారంభం

### పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం ఏకమైన జేపీసీ

### కాంతులీనుతున్న ప్రధాన రహదారి



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో ప్రధాన రహదారిపై డివైడర్ వెంబడి ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు హరీశ్ రావు ప్రత్యేక కృషితో గ్రామానికి ఈ అత్యాధునిక విద్యుత్ దీపాల సౌకర్యం సమకూరింది. అందమైన బటర్‌ఫ్లై ఆకృతిలో ఉన్న ఈ దీపాలను వెలిగించడంతో గ్రామ ప్రధాన రహదారి కాంతులతో మెరిసిపోతూ అద్భుతమైన రూపును సంతరించుకుంది. లైట్ల వెలుగులతో గ్రామం అంతా పండుగ శోభను సంతరించుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చారిత్రక నేపథ్యం ఉన్న పాలమాకుల గ్రామం, అభివృద్ధి విషయంలో మరోసారి తన ఐక్యతను చాటిచెప్పింది. గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా, కేవలం గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. గ్రామ యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రధాన రహదారిని అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ ఓజాలు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. చారిత్రక గ్రామం పాలమాకుల భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన అభివృద్ధి పనులతో ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ప్రధాన రహదారి అందంగా మెరిసిపోవడంతో యువకులు ఉత్సాహంగా వేడుకల్లో పాలుపంచుకున్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రజల సహకారం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.






## ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించాలి: కేటీఆర్ డిమాండ్

**హైదరాబాద్/సంగారెడ్డి (జనం పవర్):** బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లోని గన్ పార్క్ అమరవీరుల స్మారకం వద్ద అమరవీరుల స్థూపానికి కే టీ రామారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని, వాటి అమలుకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. "రైతులకు వెన్నుపోటు ఉ రాహుల్‌కు వెయ్యి కోట్లు", "రాహుల్ బంధు కాదు ఉ రైతు బంధు కావాలి", "పెన్షన్లు పెంచే మాట మరిచారు ఉ పేదవాళ్ల నడ్డి విరిచారు", "మహాలక్ష్మి పథకం మాట మరిచారు ఉ మహిళలను నట్టేట ముంచారు" అంటూ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

# నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మీటర్





- సహాయ ఇంజనీర్ పై విచారణ జరపాలి
- ఒకరికి ఒక రూల్.. మరొకరికి మరో రూల్.. అధికారుల వివక్షపై సన్నీ ఎడ్వర్డ్ ఆగ్రహం
- ఆన్లైన్ లో ఇంటి వివరాలు లేకున్నా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం వెనుక అంతర్యమేమిటి?

**కరీంనగర్, మార్చి 16 (జనం పవర్):**

కొత్తపల్లి విద్యుత్ ఉప కేంద్రం సహాయ ఇంజనీర్ శ్రీనివాస్ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మీటర్లు అమర్చుతున్నారని, దీనిపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని సామాజికవేత్త సన్నీ ఎడ్వర్డ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ.. రేకుర్తి ఇరవైయవ డివిజన్ పరిధిలోని మెడికల్ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు.

### నిబంధనల ఉల్లంఘన

సొసైటీలోని వందవ నంబర్ ప్లాట్ కొనుగోలు చేసిన వేదాంతం హేమలత అనే వినియోగదారురాలి ఇంటి నంబరు ఆన్లైన్ లో కనిపించకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా మీటరు ఎలా అమర్చారని ఆయన ప్రశ్నించారు. గతంలో స్థానిక లైన్ మ్యాన్ నిబంధనలు సరిగ్గా లేవని ఆమె దరఖాస్తును తిరస్కరించినప్పటికీ, సహాయ ఇంజనీర్ శ్రీనివాస్ తనకున్న వ్యక్తిగత పరిచయాలతో ఆ దరఖాస్తుకు వెంటనే అనుమతి ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. వైద్య ఆరోగ్య శాఖలో పాలనాధికారిగా పనిచేసిన ఆమె భర్తతో ఉన్న స్నేహం కోసమే ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

### విరుద్ధంగా విద్యుత్ సరఫరా

సాధారణంగా ఇంటి ముందు నుండి విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా, ఈ కేసులో ఇంటి వెనుక ఉన్న తోటల నుండి, రెండు కాంపౌండ్లు దాటి కనెక్షన్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని సన్నీ ఎడ్వర్డ్ పేర్కొన్నారు. దీనికి ఐదు విద్యుత్ స్తంభాలు అవసరమవుతాయని, వినియోగదారురాలితో కుమ్మక్కై విద్యుత్ శాఖకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సొసైటీలో పదుల సంఖ్యలో వినియోగదారులు డబ్బులు కట్టి దరఖాస్తులు చేసుకున్నా, వారికి లేని మినహాయింపు హేమలతకు మాత్రమే ఎలా లభించిందని ప్రశ్నించారు. వంద మీటర్ల కన్నా ఎక్కువ దూరంలో ఉన్న ప్రాంతానికి నిబంధనలకు విరుద్ధంగా మీటరు ఎలా కేటాయించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు.

### శాఖాపరమైన చర్యలకు డిమాండ్

గతంలోనూ సదరు అధికారిపై ఇటువంటి ఆరోపణలు వచ్చాయని, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. సహాయ ఇంజనీర్ శ్రీనివాస్ పై వెంటనే శాఖాపరమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు అందరికీ ఒకేలా ఉండాలని, సొసైటీలో నిలిచిపోయిన ఇతర వినియోగదారుల దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

# అప్రమత్తతతో నష్టాలను నివారించవచ్చు

- ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్
- పొనకల్ రాఘవేంద్ర పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలు
- విద్యార్థులకు రక్షణ చర్యలపై ప్రత్యక్ష అవగాహన



**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండటం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలను సమర్థవంతంగా నివారించవచ్చని జన్నారం మండల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జన్నారం మండలంలోని పొనకల్ గ్రామంలో గల రాఘవేంద్ర లిటిల్ హార్ట్స్ పాఠశాల ఆవరణలో అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు పడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల కనీస అవగాహన ఉండాలని, తద్వారా వారు తమ కుటుంబాలను, పరిసరాలను కాపాడుకోగలరని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు పలు భద్రతా ప్రమాణాలను ప్రత్యక్షంగా వివరించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే భయపడకుండా సురక్షిత ప్రాంతాలకు ఎలా చేరుకోవాలో తెలియజేశారు. మంటలను ఆర్పే క్రమంలో అగ్నిమాపక యంత్రాన్ని ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు స్వయంగా చేసి చూపిస్తూ అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీలు లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షుణ్ణంగా వివరించడంతో విద్యార్థుల్లో భద్రత పట్ల బాధ్యత పెరిగింది. విపత్తు సమయాల్లో ధైర్యంగా ఎలా పోరాడాలో నేర్చుకున్న విద్యార్థులు అగ్నిమాపక సిబ్బందిని అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి సామాజిక స్పృహ కలిగించే కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, ప్రిన్సిపల్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు చేపట్టిన ఈ చొరవకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

# మానవత్వమే మా మతం.. సేవే మా ధ్యేయం: మాద్రి పృథ్వీరాజ్

**అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించిన ఎండీఆర్ ఫౌండేషన్**

**పటాన్‌చెరులో మానవత్వం చాటుకున్న వైనం**



**పటాన్‌చెరు, మార్చి 16 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి జీహెచ్ఎంసీ డివిజన్ పరిధిలోని కర్దనూర్ గ్రామంలో మానవత్వాన్ని చాటే అరుదైన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద నివసిస్తున్న వృద్ధ దంపతుల్లో భర్త అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందగా, ఆయనకు బంధువులు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు తక్షణమే స్పందించి మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు అవసరమైన ఖర్చులను నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ తన సొంత ఖర్చులతో భరించి మానవతా విలువలను చాటుకున్నారు. మృతుడి భార్య మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారిన తరుణంలో ఎండీఆర్ ఫౌండేషన్ ముందడుగు వేసి అంత్యక్రియలను పూర్తి చేయడం స్థానికుల ప్రశంసలు పొందింది. మానవత్వమే మతం, సేవే తమ ధ్యేయమని ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. కష్టకాలంలో ఆదుకున్న మాద్రి పృథ్వీరాజ్ తో పాటు ఫౌండేషన్ సభ్యులకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఇటువంటి సేవలు మరిన్ని కొనసాగాలని వారు ఆకాంక్షించారు.



# సహస్ర సాధించిన విజయం మన ప్రాంతానికే గర్వకారణం

**అపర్ణ శివరాజ్ పాటిల్**

**ఖేలో ఇండియా పోటీల్లో బంగారు పతకం సాధించిన సహస్రకు ఘన సన్మానం**

**సంగారెడ్డి, మార్చి 16 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణానికి చెందిన నందిగారి సహస్ర క్రీడా రంగంలో అద్భుత విజయాన్ని అందుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత ఉమెన్స్ స్టేట్ లీగ్ 2025-26 పోటీల్లో సహస్ర బంగారు పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. శ్రీ వీరశైవ సమాజం సిద్ధాపూర్ కాలనీ, శ్రీకృష్ణ నగర్ కాలనీల అధ్యక్షులు నందిగారి సంతోష్ కుమార్ కుమార్తె అయిన సహస్ర సాధించిన ఈ విజయం పట్టణానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన నందిగారి సహస్రతో పాటు ఆమెకు నిరంతర ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులు, శిక్షకులను అపర్ణ శివరాజ్ పాటిల్ ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా యువత ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, సహస్ర సాధించిన ఈ ఘనత మన ప్రాంత కీర్తిని పెంపొందించింది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ సాజిద్, ముజీబ్, టెక్నికల్ అడ్వైజర్ మహమూద్, మహమ్మద్ షఫీ, శ్రీనివాస్ చిన్న మాస్టర్ పాల్గొన్నారు. వీరితో పాటు వీరశైవ సమాజం జిల్లా సలహాదారు అమ్మిశెట్టి జయప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షులు వీర మహేందర్ అడ్వకేట్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు సిహెచ్ సత్యనారాయణ, భాస్కర్, మోహన్ సహా పలువురు పట్టణ ప్రముఖులు హాజరై సహస్రను అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.

# వచ్చిన ఆదాయంతో గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం

**సర్పంచ్ జక్కు సుష్మా**

**పొనకల్ సంతల వేలంలో గ్రామ పంచాయతీకి 14.14 లక్షల భారీ ఆదాయం**



**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

జన్నారం మండలంలోని పోనకల్ గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన దిన, వార సంతల వేలం పాటలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అధికారులు ఈ బహిరంగ వేలాన్ని నిర్వహించగా, గ్రామాభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలువురు పోటీదారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఈ హోరాహోరీ వేలంలో బినవేని గంగన్న అత్యధిక ధరను కోట్ చేసి దిన, వార సంతల నిర్వహణ హక్కులను కైవసం చేసుకున్నారు. దిన సంత హక్కుల కోసం 4,90,000 రూపాయలు, వార సంత హక్కుల కోసం 9,24,000 రూపాయలతో కలిపి మొత్తం 14,14,000 రూపాయల భారీ ఆదాయం గ్రామ పంచాయతీకి సమకూరింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్, మండల పరిషత్ అధికారి జలంధర్ పర్యవేక్షణలో ఈ వేలం పాటలు నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మా మాట్లాడుతూ సంతల వేలం ద్వారా వచ్చిన ఈ ఆదాయాన్ని గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం మెరుగుదల వంటి పనులకు ఉపయోగిస్తామని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఈ నిధులు ఎంతో ఊతమిస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రాహుల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి

**సర్పంచ్ బానోతు లింగం**

**బస్వాపూర్ లో ఘనంగా పారిశుద్ధ్య కార్మికుల సన్మానం**

**రక్షణ పరికరాలు, సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి**



**కోహెడ, మార్చి 16 (జనం పవర్):**

పారిశుద్ధ్య కార్మికులు మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి సేవలు వెలకట్టలేనివని బస్వాపూర్ గ్రామ సర్పంచ్ బానోతు లింగం పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిరంతరం వీధుల నుండి చెత్తను సేకరించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణలో కార్మికులు ముందుంటున్నారని కొనియాడారు. ప్రాణాలకు తెగించి, ఎటువంటి రక్షణ పరికరాలు లేకపోయినా సమాజం కోసం వారు చేస్తున్న కృషి అమోఘమని తెలిపారు. వర్షాకాలంలో సైతం వరద నీటిని, చెత్తను తొలగించి ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు.

కార్మికులకు ప్రభుత్వం తక్షణమే రక్షణ పరికరాలతో పాటు హెల్త్ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్న వీరి జీవన ప్రమాణాలు పెంచడం ప్రభుత్వాల బాధ్యత అని హితవు పలికారు. పరిశుభ్రత కోసం శ్రమించే ప్రతి పారిశుద్ధ్య కార్మికుడు నిజమైన దేశభక్తుడని, వారిని సమానంగా గౌరవించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్ గౌడ్, వార్డు సభ్యుడు బుక్య నాయక్, మాజీ సర్పంచ్ తాటిపాముల శ్రీనివాస్, అమరేందర్ రెడ్డి, ముజాయిద్దీన్, పుల్లూరి బ్రహ్మం, గోండా రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

**బీజేపీ జోనల్ అధ్యక్షులు**

**నస్పూర్ లో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**

**ఇళ్ల పట్టాలు, నివాసాల కోసం నిరసన**

**నస్పూర్, మార్చి 16 (జనం పవర్):**

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నస్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులు సోమవారం భారీ ధర్నా చేపట్టాయి. పార్టీ జోనల్ అధ్యక్షులు సత్రం రమేష్, కుర్రే చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పేదలందరికీ వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, విశ్రాంత కార్మికులకు రెండు గుంటల భూమితో పాటు శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఎన్నికల వేళ ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ రావు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కోసం గట్టిగా నినదించారు.



# నాకు పెన్షన్లు వద్దు.. కష్టపడి బతికేందుకు భూమి ఇవ్వండి

- మాజీ మహిళా కమాండర్ విజయకాంత ఆవేదన
- జనజీవన స్రవంతిలోకి వచ్చినా అందని ప్రభుత్వ సాయం
- కలెక్టరేట్ లో ప్రజావాణి ద్వారా విన్నపం



**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

ఒకప్పుడు ఆయుధం పట్టి అడవిని శాసించిన ఆమె, నేడు తన ఉనికిని కాపాడుకోవడానికి, గౌరవప్రదమైన ఉపాధి కోసం పోరాడుతున్నారు. సీపీఐ (ఎంఎల్) పార్టీలో మహిళా దళ కమాండర్‌గా పనిచేసి వ్యవస్థ మార్పు కోసం పోరాడిన బత్తుల విజయకాంత, ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుండి అందాల్సిన కనీస సాయం అందకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మి కులాంతర వివాహం చేసుకున్న ఆమె, లొంగిపోయిన తర్వాత సమాజంలో గౌరవంగా బతకాలని ఆశించినప్పటికీ, గతంలో ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం చేతిలో పనిలేక, సాగు చేయడానికి భూమి లేక ఆమె కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది.

ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు 'ప్రజావాణి'లో తన గోడును వెళ్లబోసుకున్నారు. తనకు వేల రూపాయల పెన్షన్లు వద్దని, కేవలం కష్టపడి బతకడానికి జన్నారం మండలంలో కొంచెం ప్రభుత్వ భూమి ఇస్తే చాలని ఆమె కోరారు. అక్కడ పండ్ల తోటలు పెంచి, పశువులను పోషించుకుంటూ గౌరవంగా జీవిస్తానని, ఆ తోటల ద్వారా పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను కూడా నెరవేరుస్తానని వివరించారు. పోరాటాల నుంచి వచ్చిన ఒక మహిళ స్వశక్తితో ఎదగాలని చూస్తున్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తక్షణమే జన్నారం మండల అధికారులు స్పందించి, ఆమెకు సాగు భూమిని కేటాయించి ఒక మాజీ విప్లవకారిణి పునరావాసానికి అర్థం పరమార్థం చేకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.

# మెరుగైన సేవలే నా లక్ష్యం

**తహసీల్దార్ గందె లక్ష్మీనరసింహారావు**

**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వెల్లడి**



**కరీంనగర్, మార్చి 16 (జనం పవర్):**

కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ గందె లక్ష్మీనరసింహారావును ఉద్యోగ సంఘాల నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం తహసీల్దార్ గందె లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకమైన పరిపాలన అందిస్తానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను సహానుభూతితో విని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, టీజీవోల జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళి చరణ్, కార్యదర్శి డాక్టర్ అరవింద్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా సమర్థవంతంగా పనిచేయాలని నాయకులు ఈ సందర్భంగా కోరారు.

# నిర్మల్ వండర్ ల్యాండ్ ప్రారంభం

**చిన్నారుల వినోదం, దేహదారుఢ్యానికి చక్కని కేంద్రం**

**ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్**



**వేల్పుల నగేష్ , జనం పవర్ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా**

నిర్మల్ జిల్లా కేంద్రంలో చిన్నారుల శారీరక దారుఢ్యం, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వండర్ ల్యాండ్‌ను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వేడుకకు బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో పాటు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వండర్ ల్యాండ్ నిర్మల్ పట్టణ ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు వినోదాన్ని అందిస్తుందని తెలిపారు. దేహదారుఢ్యానికి, ఆహ్లాదకరమైన విశ్రాంతికి ఇది ఒక ఉత్తమ కేంద్రంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మోదంకుంట భూమిని సర్వే చేయాలి

**సర్పంచ్ కృష్ణ గౌడ్**

**తహసీల్దార్ రవికుమార్ కు వినతి పత్రం సమర్పణ**

**కంది, మార్చి 16 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చిమ్నాపూర్ గ్రామ పరిధిలో ఉన్న మోదంకుంట భూమిని వెంటనే సర్వే చేయించాలని కోరుతూ సర్పంచ్ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రవికుమార్ కు వినతి పత్రం సమర్పించారు. చిమ్నాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 161లో ఉన్న మోదంకుంట భూమిని అధికారికంగా సర్వే చేయాలని ఈ సందర్భంగా విన్నవించారు. అనంతరం సర్పంచ్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ మోదంకుంట భూమిని సర్వే చేయడం వల్ల గ్రామానికి భవిష్యత్తులో అనేక రకాలుగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు త్వరితగతిన స్పందించి సర్వే నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంది గ్రామంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**పది లక్షల రూపాయల వ్యయంతో మెరుగైన రవాణా సౌకర్యాలు**

**సర్పంచ్ చిన్న సాయి శ్రీరామ్**



**కంది, మార్చి 16 (జనం పవర్):**

సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ చిన్న సాయి శ్రీరామ్ సోమవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్న సాయి శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు



**నస్పూర్, మార్చి 16 (జనం పవర్):**

మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత కార్యాలయాల భవనంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. పది నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు అందించాలని ఎంసీసీ సిబ్బంది కోరగా, ప్రభుత్వ వాటర్ ట్యాంక్ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి పట్టణవాసులు విన్నవించారు. గురుకుల పాఠశాలలో సీటు, సన్న రకం వడ్లకు బోనస్, భూమి అక్రమ పట్టా రద్దు, వారసత్వ భూముల మార్పిడి వంటి పలు అంశాలపై ప్రజలు పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, మత్స్య సహకార సంఘాల్లో నూతన సభ్యుల నమోదు చేపట్టాలని దరఖాస్తుదారులు కోరారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వరదల కారణంగా ఇబ్బందులు పడే నివాసాలను గుర్తించి సమగ్ర నివేదిక అందించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అధికారులు సమర్పించే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

# అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎం.డి. అప్జల్ బాధ్యతల స్వీకరణ

**వైద్య ఉద్యోగ సంఘాల నాయకుల అభినందనల వెల్లువ**



**కరీంనగర్, మార్చి 16 (జనం పవర్):**

కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎం.డి. అఫ్జల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తన నియామక పత్రాన్ని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. తకియుద్దీన్ ఖాన్ కు అందించి విధుల్లో చేరారు. గతంలో ఆయన వైద్య ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరింటెండెంట్‌గా కరీంనగర్ తో పాటు సిద్దిపేట మెడికల్ కాలేజీల్లో సేవలందించారు. ఎం.డి. అఫ్జల్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు టి. రామారావు, సౌడమల్ల సన్నీ ఎడ్వర్డ్, ఎం.డి. అతీక్, దేవరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సౌడమల్ల అగస్టిన్, ఆఫీస్ సూపరింటెండెంట్ నయీం పాల్గొన్నారు.



# రంజాన్ సోదరభావానికి ప్రతీక

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- నియోజకవర్గంలో పలుచోట్ల ఘనంగా ఇఫ్తార్ విందులు



**సంగారెడ్డి, మార్చి 16 (జనం పవర్):**

సంగారెడ్డి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పలు ఇఫ్తార్ విందుల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇఫ్తార్ విందుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి 11, 12 వార్డుల్లో జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.

పట్టణంలోని 11వ వార్డులో మాజీ కౌన్సిలర్ గడ్డం సరిత తులసి రామ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ఆమె ఉపవాస విరమణ చేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం సోదరభావం, సహనం, సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సఖ్యతతో జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ, నాయకులు జైపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మత పెద్దలు పాల్గొన్నారు.

